క్లుప్తంగా

మేట్‌లు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ గౌరీకుమారి

ఉప్పలగుప్తం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్‌లు సమన్వయంతో పనిచేయాలని ఈవోపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాలకు చెందిన 40 మంది మేట్‌లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రైతులకు అనుకూలంగా పనులను గుర్తించి చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వి.రాజామణి, ఎంటీసీ కల్యాణి, టీఏలు అనిల్, బాలరాజు, ఎం.దేవిపార్వతి తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరికి కేఆర్‌ఎస్‌ఎస్ వినతి పత్రం

అమలాపురం టౌన్: కోటిపల్లి–నర్సాపురం రైల్వే ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేసే అంశాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ అమలాపురం వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు గురువారం వినతి పత్రం అందించారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కమిటీ ప్రతినిధులు బీఎస్ మూర్తి, యర్రమిల్లి పాండురంగారావు, ఎరగర్త వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శివాజీ తదితరులు పురందేశ్వరిని కలిసి రైల్వే ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అయినాపురం, అనాతవరం, ముమ్మిడివరం కొత్తలంక, ఠానేల్లంక ఫీడర్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల, ఐ.పోలవరం సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ అధికారులు గురువారం నిర్వహించిన దాడుల్లో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. తాళ్లరేవు ఎస్‌ఈబీ సీఐ జీవీ భవానీ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సత్రంపేటకు చెందిన విత్తనాల సత్యనారాయణ అక్రమంగా మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 106 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దాడిలో కాకినాడ టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం

అమలాపురం రూరల్: గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్, జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ అల్లాడి తదితరులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు.

గ్రూప్-బి పోస్టులకు వయసు సడలింపు

యానాం: డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వివిధ శాఖల్లోని గ్రూప్-బీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీలో నిరుద్యోగులకు రెండేళ్ల వయోపరిమితి సడలింపునిచ్చే ఫైలుపై పుదుచ్చేరి ఎల్జీ తమిళిసై సౌందరాజన్ గురువారం ఆమోదముద్ర వేశారు. అదేవిధంగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ నియామకానికి సంబంధించి నిబంధనలపై కేంద్రానికి ప్రతిపాదనల ఫైలుకు, పశుసంవర్ధక శాఖలో రూ.1.31 కోట్ల మందుల కొనుగోలు ఫైళ్లకు సైతం ఆమె ఆమోదం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు వేడుకల్లో పాల్గొని తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బుద్ధ విహార్ పార్కులో పార్టీ నియోజక వర్గ కన్వీనర్ గెద్దం సురేష్‌బాబు జెండా ఆవిష్కరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలేకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది



అమలాపురంలో ఎమ్మెల్యే పొన్నాడను పరామర్శిస్తున్న నేతలు

- ఆప్తుల వద్ద ఎమ్మెల్యే పొన్నాడ ఆవేదన
- ఫోన్‌లో పరామర్శించిన పలువురు మంత్రులు

అమలాపురం టౌన్: అమెరికా దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నా పినతండ్రి, పినతల్లే కాకుండా ఆ కుటుంబ సభ్యులు కూడా మృతి చెందడం మా కుటుంబానికి తీరని లోటని ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తనను పరామర్శించేందుకు వచ్చిన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తన పినతండ్రి నాగేశ్వరరావు మృతితో మా కుటుంబం ఓ పెద్ద దిక్కును కోల్పోయిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే పొన్నాడను రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫోన్‌లో పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. పరామర్శించినవారిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు న్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి వచ్చి పరామర్శించారు. ఎమ్మెల్యే పొన్నాడ పినతండ్రి కుటుంబీకుల మృతదేహాలను అమెరికా నుంచి మన దేశానికి రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రాకెట్ సైన్స్‌పై అవగాహన అవసరం

ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శివప్రసాద్



రాకెట్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శివప్రసాద్

అమలాపురం టౌన్: రాకెట్ సైన్స్‌పై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ యాళ్ల శివప్రసాద్ అన్నారు. అమలాపురంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం వేర్వేరుగా జరిగిన అవగాహన సదస్సుల్లో డాక్టర్ శివప్రసాద్ రాకెట్ సైన్స్‌పై పలు అంశాలను వివరించారు. విద్యార్థులకు రాకెట్ నమూనాలను చూపిస్తూ అవి ఎలా పనిచేస్తాయి, ఎందుకు పంపిస్తారు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రాకెట్ సైన్స్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో ప్రశ్నలు వేసి ఉత్తమ సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా సదస్సుల్లో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ ఆర్‌ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎల్.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈపై సైన్స్ టీచర్లకు శిక్షణ

యానాం: నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ(సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌ను అమలుచేస్తున్న నేపథ్యంలో దానిపై అవగాహన కల్పించేందుకు పుదుచ్చేరిలో విద్యా శాఖ ఇస్తున్న శిక్షణకు యానాం నుంచి 24 మంది సైన్స్ టీచర్లు హాజరవుతున్నారని విద్యాశాఖాధికారి పి.లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. సీబీఎస్‌ఈ కరిక్యులమ్, విద్యా ప్రణాళిక, పాఠ్యాంశాలు బోధించేటప్పుడు అనుసరించవలసిన బోధనా మాధ్యమం, బోధనోపకరణాల వినియోగం, మూల్యాంకనం తదితర అంశాలపై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో 29, 30 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

యానాం: నియోజకవర్గ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కట్టా సుబ్బరాజు గురువారం తెలిపారు. యానాం నుంచి రూ.5,280 విలువజేసే 39 మద్యం బాటిళ్లను సావిత్రినగర్ న్యూకాలనీకి చెందిన నీలం శ్రీను బైక్‌పై తరలిస్తుండగా దరియాలతిప్ప నయారా పెట్రోల్‌బంక్ పరిసర ప్రాంతంలో పట్టుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని యానాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించామన్నారు.

బీజేపీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

అమలాపురం రూరల్: బీజేపీ కార్యకర్తలంతా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం అమలాపురంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా అమలాపురం విచ్చేసిన పురందేశ్వరికి ఈదరపల్లి వంతెన నుంచి మోటార్ సైకిళ్లతో ర్యాలీ తీస్తూ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, అసెంబ్లీ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జనసేనతో బీజేపీ పొత్తులో ఉందని, టీడీపీతో పొత్తు విషయంపై పార్టీ అగ్ర నేతలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, భారతీయ జనతా యువమోర్చ రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ యల్లమిల్లి నాగ సుధా కొండ, కోన సత్యనారాయణ, జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస మహోత్సవాలు

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం 11వ రోజు ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పెద్దింటి రఘురామవినోద్, లక్ష్మణాచార్యులు స్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

సీనియర్ ఐఏఎస్ అధికారి శోభిత్ గుప్తా



లబ్ధిదారులకు ఉజ్వల కనెక్షన్‌ను పంపిణీ చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి శోభిత్ గుప్తా

అల్లవరం: పేదరికం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను అందజేస్తుందని కేంద్ర ఎడ్యుకేషన్ ఆఫ్ మినిస్ట్రీస్ సీనియర్ ఐఏఎస్ అధికారి శోభిత్ గుప్తా అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడసకుర్రు, అల్లవరం గ్రామాల్లో గురువారం నిర్వహించారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్ అధికారి శోభిత్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వలంటీర్లు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా చేరవేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ భారత్‌ని అగ్రస్థానంలో ఉంచేందుకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. అనంతరం ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఓఎన్‌జీసీ సంస్థ బోడసకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శోభిత్ గుప్తాకు వినతి పత్రం అందించారు. అల్లవరంలో సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీటీసీ ఎం.మౌనిక, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, డీఎల్‌పీఓ బొజ్జిరాజు, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, బీజేపీ నాయకుడు ఆకుల వీరబాబు, కార్యదర్శులు రాజమోహన్, దుర్గా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలి

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం రూరల్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎల్‌పీజీ డీలర్లందరూ ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్స్, డీలర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొందరు ఎల్‌పీజీ డీలర్లు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు తీసుకోవడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి లేదని ఆదేశించారు. గ్యాస్ కనెక్షన్‌దారుల ఈ-కేవైసీ విషయంలో ఎటువంటి తుది గడువు లేదన్నారు. డెలివరీ బాయ్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌లోనే ఈ-కేవైసీ చేయొచ్చని, ఒకవేళ ఈ-కేవైసీ చేయకపోయినా గ్యాస్ సరఫరా చేయాలన్నారు.

ముగ్గురు వలంటీర్ల తొలగింపు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్న ముగ్గురు వలంటీర్లపై అధికారికంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సూర్యనగర్‌లో వలంటీర్లుగా పనిచేస్తున్న రెడ్డి సతీష్‌కుమార్, యనమదల ఉమామహేశ్వరరావు, శ్రీరామపురంలో పనిచేస్తున్న ఎ.బాబాజన్‌లను విధులను తొలగించినట్లు స్పష్టం చేశారు. తొలగించిన వలంటీర్ల స్థానే ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని సంబంధిత వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలను ఆదేశించారు. మున్సిపాలిటీలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వలంటీర్లు సమ్మె చేస్తే వారిపై తక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాయుడు హెచ్చరించారు.

శెట్టిబలిజలు సంఘటితం కావాలి



కోడూరుపాడులో సమావేశమైన శెట్టిబలిజ నేతలు

అల్లవరం: గ్రామగ్రామాన శెట్టిబలిజలు సంఘటితం కావాలని సంఘ నేత బొక్కా శ్రీను పిలుపునిచ్చారు. గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్‌లో మండలంలోని శెట్టిబలిజ సామాజిక నేతలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడికక్కడ శెట్టిబలిజ సంఘాలు బలోపేతం కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జనవరి చివరి నాటికి అన్ని గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసుకుని మండల స్థాయి ఐక్య వేదికకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, గుబ్బల చినబాబు, ఎంపీటీసీ గుబ్బల బాబ్జి, దొమ్మేటి సురేష్, మాజీ సర్పంచ్ వాసర్ల వెర్రియ్య, బొక్కా ప్రసాద్, చొల్లంగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరియాంపేటలో సంకల్ప యాత్ర



ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న డీడీ రవిశంకర్

యానాం: నియోజకవర్గ పరిధిలోని తీర గ్రామాలైన గిరియాంపేట, సావిత్రినగర్‌లలో భారత వికసిత్ సంకల్ప యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ పాల్గొని మాట్లాడారు. కేంద్రం అందిస్తున్న పథకాలు దిగువ స్థాయి వర్గాలకు చేరాలన్నదే వికసిత్ భారత్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



భీమనపల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎల్‌డీవో విజయ్‌థామస్

ఉప్పలగుప్తం: ఆటలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని డీఎల్‌డీవో పి.విజయ్‌థామస్ అన్నారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల్లో యువతంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి, ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ, పీడీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. గురువారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కిషోర్ అధ్యక్షతన జరిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ముందంజలో ఉండాలనే ఆకాంక్షతో డిజిటల్ విద్యకు బాటలు వేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలతో కలిసి పాఠశాలలో 120 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి రెడ్డిబాబు, చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, మట్టపర్తి శ్రీనివాస్, కుడుపూడి మల్లేష్, ఉపాధ్యాయుడు వాకపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాల వార్షికోత్సవం



దివ్యాంగులతో కేక్ కట్ చేయిస్తున్న ఎంపీడీఓ అనుపమ

తాళ్లరేవు: దివ్యాంగుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు, రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు ధీరూబాయి అంబానీ జయంతోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ అండ్ రీహేబిలిటేషన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ ఎం.అనుపమ, రిలయన్స్ సీఎస్‌ఆర్ హెడ్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దివ్యాంగులచే కేక్ కట్ చేయించి అందరికీ పంచారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీఓ అనుపమ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, సెంటర్ ప్రతినిధి ఎంజే గోపాల్‌రావు, ఫిజియోథెరపిస్ట్ కె.శ్రీకాంత్, స్టీఫెన్, పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన ఆర్డీవో



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. కళాశాలలో కావాల్సిన సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్ కవల కోటిలింగాన్ని ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనకబడిన విద్యార్థినుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాన్నామని ప్రిన్సిపాల్ కోటిలింగం వివరించారు. ఆర్డీవో వెంట జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఈవీఎంల వినియోగంపై యువతకు అవగాహన



ఈవీఎంల వినియోగంపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సిబ్బంది

యానాం: ఓటు వేయడానికి ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్)లను ఏవిధంగా ఉపయోగించుకోవాలో స్థానిక యువతీయువకులకు ఎన్నికల సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రతినిధి తిరుకోటి అర్జునరావు మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు భావి భారత పౌరులంతా ముందుకు రావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ప్రజలకు అందుబాటులో డిజిటల్ సేవలు



ఉప్పలగుప్తంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ప్రజలకు అందుబాటులో డిజిటల్ సేవలు జరుగుతున్నాయని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, ఉప్పలగుప్తం సర్పంచ్ కడిమి చిన్నవరాజు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ పరిధి సచివాయలం–2 పరిధిలో నూతనంగా మంజూరైన ఆధార్ సెంటర్‌ను సర్పంచ్ చిన్నవరాజు గురువారం ప్రారంభించారు. అందుబాటులోకి వస్తున్న సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిన్నవరాజు సూచించారు. కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, మధుర సదానందం, వీఏ బొంతు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం, నిందితుడితో తాళ్లరేవు ఎస్‌ఈబీ పోలీసులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ అధికారులు గురువారం నిర్వహించిన దాడుల్లో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. తాళ్లరేవు ఎస్‌ఈబీ సీఐ జీవీ భవానీ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సత్రంపేటకు చెందిన విత్తనాల సత్యనారాయణ అక్రమంగా మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 106 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. దాడిలో కాకినాడ టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎంవీవీబీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో భవనాల్లో అద్దెకు నివాసముంటున్న బొలిశెట్టి వెంకట దుర్గాప్రసాద్(28) చాకుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. రాజోలు మండలం కూనవరం గ్రామానికి చెందిన బొలిశెట్టి వరలక్ష్మి తన కుమారుడు వెంకట దుర్గాప్రసాద్‌తో కలిసి కొంతకాలంగా టిడ్కో ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం తల్లి మందలించిందని దుర్గాప్రసాద్ చాకుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు స్పందించి అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.